23-8-26:Layout 1 9/2/2026 10:59 PM Page 1

నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
RNI No. TGTEL/25/A3190

# రేషన్ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్..

## 3 నెలల బియ్యం పంపిణీ గడువు పొడిగింపు..




**హైదరాబాద్ బ్యూరో /నేటి దిక్సూచి :** రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేస్తుండగా.. ఆ గడువును మొదట ఆగస్ట్ 31 వరకు గడువు నిర్ణయించారు. అయితే తాజాగా ఆ గడువును మరో 5 రోజుల పాటు పొడిగించారు. రేషన్ దుకాణాల వద్ద భారీగారద్దీ, రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు లబ్ధిదారులు సొంతూళ్లకు వెళ్లడం వంటి కారణాలతో చాలామంది బియ్యం తీసుకోలేకపోయారు. దీంతో పౌరసరఫరాల శాఖ బియ్యం పంపిణీ గడువును పొడిగించింది.

# మహాలక్ష్మి మిల్లులో మళ్లీ రేషన్ బియ్యం కలకలం

## వాహనాన్ని వెంబడించిన టాస్క్‌ఫోర్స్.. మిల్లులో కలిపి 400 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తింపు

## గతంలోనూ ఇదే మిల్లుపై చర్యలు.. అక్రమ నిల్వలపై అధికారుల దృష్టి



**సిద్దిపేట/రాయపోల్, సెప్టెంబరు 2, నేటి దిక్సూచి :** ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమంగా చేతులు మారుతున్న వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యం గుర్తించడం కలకలం రేపింది. శామీర్‌పేట నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఈచర్ వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు వెంబడించి పట్టుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వాహనంలోని బియ్యంతో పాటు మిల్లులో ఉన్న నిల్వలను కలిపి సుమారు 400 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

**వాహనం నుంచి మొదలైన తనిఖీలు..**

విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ టీం--5 అధికారులు బుధవారం తెల్లవారుజామున మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఈచర్ వాహనాన్ని గుర్తించారు. వెంటనే వాహనాన్ని వెంబడించగా అది రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్ వద్దకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడ తనిఖీ చేయగా సుమారు 120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.

**మిల్లులో మరో 280 క్వింటాళ్లు**

వాహనంలో రేషన్ బియ్యం పట్టుబడటంతో అధికారులు మిల్లులోనూ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మరో 280 క్వింటాళ్ల వరకు పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో వాహనంతో పాటు మిల్లులో కలిపి సుమారు 400 క్వింటాళ్ల రేషన్ బియ్యం వెలుగులోకి వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం ఒకే చోట లభించడంతో దాని మూలాలు, తరలింపు వెనుక ఉన్న వ్యవహారంపై అధికారులు దృష్టి సారించారు.

**వాహనం స్వాధీనం.. డ్రైవర్ అదుపులో**

పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఈచర్ వాహనం యా–05–ఖజ–5599ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ మాలోత్ శ్రీకాంత్ (పుట్టగూడెం, రాజాపేట మండలం, యాదాద్రి–భువనగిరి జిల్లా)ను అదుపులోకి తీసుకుని విచారించారు. మిల్లు యజమాని బచ్చు నాగరాజును కూడా అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం వాహనం, బియ్యం, డ్రైవర్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. డీటీసీఎస్ అధికారులకు సమాచారం అందించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

గతంలోనూ ఇదే మిల్లుపై నిఘా

మహాలక్ష్మి రైస్‌మిల్ పేరు రేషన్ బియ్యం వ్యవహారంలో వినిపించడం ఇదే తొలిసారి కాదని అధికారులు పేర్కొంటున్నారు. జూలైలోనూ ఇదే మిల్లులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు సమాచారం. గతంలో ప్రభుత్వ నూర్పిడి కోసం మిల్లుకు సరఫరా చేసిన సుమారు 30 వేల బస్తాల వడ్లకు సంబంధించిన బియ్యం ప్రభుత్వానికి అప్పగించలేదన్న అంశం కూడా అధికారుల పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది.

**అక్రమ దందా వెనుక ఎవరున్నారు?**



ఒకే మిల్లులో గతంలోనూ, తాజాగా మరోసారి భారీగా పీడీఎస్ బియ్యం గుర్తించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? మిల్లుకు తరలించేందుకు ఎవరు సహకరించారు? ఇక్కడి నుంచి బియ్యం ఎక్కడికి తరలించాల్సి ఉంది? గతంలో జరిగిన వ్యవహారాలతో తాజా ఘటనకు ఏమైనా సంబంధం ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. పేదలకు అందాల్సిన బియ్యం అక్రమ వ్యాపారానికి తరలకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కేసులు నమోదైనా.. మారని రేషన్ మాఫియా!

## కల్వకుర్తిలో యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా..

## సరిహద్దులు దాటుతున్న అక్రమ రవాణా




**కల్వకుర్తి/నేటి దిక్సూచి:** పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పలుమార్లు పట్టుబడుతున్నా.. కేసులు నమోదవుతున్నా.. కల్వకుర్తిలో రేషన్ బియ్యం అక్రమ దందా మాత్రం ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల దాడులు, కేసులు కూడా అక్రమార్కుల్లో భయం కలిగించలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పరిధిలో కొందరు దళారులు రేషన్ దుకాణాల నుంచి, లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. సేకరించిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పట్టుబడుతున్నా.. మళ్లీ అదే దందా

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు పలు సందర్భాల్లో దాడులు నిర్వహించి వాహనాలను, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కొద్దిరోజులకే అదే తరహాలో అక్రమ రవాణా కొనసాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేవలం వాహనాలను పట్టుకోవడం, కేసులు నమోదు చేయడంతో సమస్య పరిష్కారం కాదని.. ఈ దందా వెనుక ఉన్న ప్రధాన వ్యాపారులు, సేకరణదారులు, మధ్యవర్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిఘా ఎక్కడ?

రేషన్ బియ్యం ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఎవరు కొనుగోలు చేస్తున్నారు? ఎక్కడ నిల్వ చేస్తున్నారు? ఏ వాహనాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లకుండా రేషన్ దుకాణాల నుంచి లబ్ధిదారుల వరకు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని, సరిహద్దు మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కేసులు నమోదైనా.. దాడులు జరిగినా.. రేషన్ బియ్యం దందా కొనసాగుతుండటంతో అసలు మాఫియా ఎవరి అండతో నడుస్తోందన్న ప్రశ్నలు కల్వకుర్తిలో చర్చనీయాంశంగా మారాయి.

ఎవరెవరు రేషన్ దందా కొనసాగిస్తున్నారు పూర్తి వివరాలు రేపటి సంచికలో